నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, గురువారం 8 ఫిబ్రవరి 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

అబద్ధాలు చెప్పి గద్దెనెక్కారు

- కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి
- కేసీఆర్ ఆదేశిస్తేనే పోటీ • శివరాత్రి తర్వాత గ్రామాల్లో పర్యటన
- నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 7: కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతోనే గద్దెనెక్కిందని, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు పర్చడంలో తాత్సారం చేస్తున్నారని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం తిమ్మాజిపేట మండలం నేరళ్లపల్లిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఆచరణలో అమలు అసాధ్యమన్నారు. ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని, ఇది మరోసారి రుజువైందన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్న కాంగ్రెస్ నాయకులు అనేక కోర్రీలు పెడుతున్నారన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ మోసాన్ని గుర్తిస్తారన్నారు. ప్రధానంగా ప్రాజెక్టులను కాంగ్రెస్ పార్టీ కేంద్రానికి అప్పగించడంతో ఇక్కడి రైతాంగం తీరని అన్యాయానికి గురవుతుందన్నారు. పదేండ్ల పాటు కేంద్రం ఎంత ఒత్తిడి తెచ్చినా కేసీఆర్ ముందు చూపుతో కేంద్రానికి ప్రాజెక్టులను అప్పగించలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే అప్పణంగా ప్రాజెక్టులను కేంద్రానికి కట్టబెట్టిందన్నారు. దీంతో రానున్న రోజుల్లో కృష్ణా నదీ పరివాహక జిల్లాలో తాగునీటితోపాటు సాగునీరు అందే పరిస్థితులు లేవన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఐదేండ్లుగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు తాగునీరు అందించామని, నేడు మిషన్ భగీరథపై కుట్ర జరుగుతుందన్నారు. గతంలో ఖాళీ బిందెలనేవి కనిపించలేదని, నేడు రోడ్లపై, సోషల్ మీడియాలో ఖాళీ బిందెలు దర్శనమిస్తున్నాయని, గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించే పరిస్థితి ఏర్పడిందన్నారు. తాను కేసీఆర్ సైనికుడినని, కేసీఆర్ ఎక్కడ పోటీ చేయమంటే అక్కడ పోటీ చేస్తానన్నారు. పార్టీ మారుతున్నారన్న వదంతులు గత పదేండ్లుగా వస్తున్నాయని, తాను ఎక్కడికి వెళ్లేది లేదని, కేసీఆర్ వెంటనే నడుస్తానని ప్రకటించారు. శివరాత్రి తర్వాత వారంలో రెండుమూడు రోజులు గ్రామాల్లో పర్యటిస్తానని, పదేండ్లుగా తన వెంట ఉన్న కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జోగుప్రదీప్, ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, వైస్ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచులు వేణుగోపాల్‌గౌడ్, నర్సింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కందులు క్వింటా@ రూ.10,183

జడ్చర్ల, ఫిబ్రవరి 7: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం కందికి అత్యధికంగా రూ.10,183 ధర పలికింది. మార్కెట్‌కు 85 క్వింటాళ్ల కందులు అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ. 10,183, కనిష్ఠంగా రూ.9,840, మధ్యస్తంగా రూ.10,182 ధర లభించింది. అదేవిధంగా 6,322 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి రాగా దానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.7,276, కనిష్ఠంగా రూ.4,390, మధ్యస్తంగా రూ.7,137 ధర వచ్చింది. అలాగే పత్తి క్వింటాకు గరిష్ఠంగా రూ.6,429, మినుములు క్వింటాకు గరిష్ఠంగా రూ.9,139, బెబ్బర్లు క్వింటాకు గరిష్ఠంగా రూ.7,416, మొక్కజొన్న క్వింటాకు గరిష్ఠంగా రూ.1,952, ఆర్ఎన్ఆర్ రకం ధాన్యం క్వింటాకు గరిష్ఠంగా రూ.3,168, జొన్నలు క్వింటాకు గరిష్ఠంగా రూ.5,754, ఉలువలు క్వింటాకు గరిష్ఠంగా రూ.7,267 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

మైనర్‌పై లైంగికదాడి

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

మాగనూరు, ఫిబ్రవరి 7: మండలంలోని ఓ గ్రామంలో మైనర్ బాలిక లైంగికదాడికి గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల వివరాల ప్రకారం బాలిక నివాస స్థలం సమీపంలో పాడుబడ్డ ఇండ్లు ఉన్నాయని, మధ్యాహ్నం అటు నుంచి వెళ్తున్న బాలికను అదే గ్రామానికి చెందిన వ్యక్తి(23) బాలికను పాడుబడ్డ ఇండ్లలోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడినట్లు తెలిపారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లేశ్ తెలిపారు.

ఎవరిని వరించేనో..?

- రసవత్తరంగా మహబూబ్‌నగర్ పుర చైర్మన్ ఎన్నిక
- పావులు కదుపుతున్న ఆశావహులు
- 12న సమావేశానికి గెజిట్ నోటిఫికేషన్

మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్యాలయం

మహబూబ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 7 : మహబూబ్‌నగ ర్ మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం నె గ్గడంతో కొత్త వారిని ఎన్నుకునేందుకు రంగం సిద్ధమైంది. ఈనెల 12వ తేదీన పురపాలక సమావేశం ఏర్పాటు చేసేందుకు గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. జనవరి 27న ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంలో ఆయా పార్టీలు కలిసివచ్చిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ నుంచి చైర్మన్‌ను ఎన్నుకునేందుకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దిశానిర్దేశం చే శారు. కాగా, బీఆర్ఎస్ కౌన్సిలర్ చైర్పర్సన్ పదవిని కైవసం చేసుకునేందుకు పలువురిని సంప్రదించారు. దీంతో చైర్మన్ ఎన్నిక రసవత్తరంగా మారింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందే బీఆర్ఎస్‌ను వీడిన 21వ వార్డు కౌన్సిలర్ ఆనంద్‌కుమార్‌గౌడ్ కాంగ్రెస్‌లో చేరి చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. అన్ని పార్టీల కౌన్సిలర్లు, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుల మద్దతు కూడా ఈయనకే ఉన్నది. అయితే, వైస్ చైర్మన్ పదవి ని మాత్రం ముస్లిం కౌన్సిలర్‌కు కేటాయించాలని పలువురు కోరుతుండగా.. ఎంఐఎం మాత్రం తమ కౌన్సిలర్‌కు ఆ పదవిని కట్టబెట్టాలని పట్టుబడుతున్నది. తమకూ అవకాశం కల్పించాలని బీజేపీ కౌన్సిలర్లు కోరినట్లు సమాచారం. అయితే 29వ వార్డు స్వతంత్ర అభ్యర్థి మొయిన్ అలీ వైపు కాంగ్రెస్ నాయకులు మొగ్గు చూపుతున్నారు. బీఆర్ఎస్ తరపున కౌన్సిల్‌లో ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరించిన షబ్బీర్ అహ్మద్ సైతం వైస్ చైర్మన్ పదవి కావాలని కోరినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఆయా పార్టీల నాయకులు తమ కౌన్సిలర్లను కాపాడుకునే పనిలో తలమునకలవుతున్నారు.

26మంది కౌన్సిలర్లు హాజరైతే చాలు..

మహబూబ్‌నగర్ పురపాలికలో 49 మంది కౌన్సిలర్లు ఉండగా, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే ఓటు కలుపుకొని మొత్తం 50 ఓట్లు ఉన్నాయి. గెజిట్ నోటిఫికేషన్ ఆధారంగా ఈనెల 12వ తేదీన నిర్వహించే కౌన్సిల్ సమావేశానికి 26 మంది హాజరై.. ఏ అభ్యర్థిని బలపరిస్తే వారికే పుర చైర్మన్ పీఠం దక్కనున్నది. వైస్ చైర్మన్ అభ్యర్థి ఎంపికకు సైతం ఇదే ప్రక్రియ నిర్వహించనున్నారు. కాగా చైర్మన్ పీఠాన్ని దక్కించుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ పడుతున్నాయి.

కర్షకుల కన్నెర

అచ్చంపేటలో వేరుశనగ కుప్పకు నిప్పంటించి నిరసన తెలుపుతున్న రైతులు

- వేరుశనగకు మద్దతు ధర కోసం డిమాండ్
- ఒక్కరోజే రూ.వెయ్యి వరకు తగ్గించడంపై ఆగ్రహం
- అచ్చంపేటలో కడుపుమండిన రైతులు
- మద్దతు ధర కల్పించాలని రోడ్డెక్కి ధర్నా
- రేటు లేదని పల్లీకి నిప్పంటించి నిరసన
- ఎక్కువ ధర ఇస్తామన్న వ్యాపారులు
- రాత్రి కావడంతో మార్కెట్‌లోనే పడిగాపులు

అచ్చంపేట/అచ్చంపేట రూరల్, ఫిబ్రవరి 7 : వేరుశనగకు గిట్టుబాటు ధర కల్పించాలని అచ్చంపేటలో రైతులు ఆందోళన నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వేరుశనగకు కనీస మద్దతు ధర కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా మార్కెట్‌లో తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారని, క్వింటాకు 4 కిలోల తరుగుతీస్తూ వ్యాపారులు రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. బుధవారం అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌కు దాదాపు 421మంది రైతులు అచ్చంపేట, ఉప్పునుంతల, బల్మూర్ మండలాల నుంచి వేరుశనగను విక్రయానికి తీసుకొచ్చారు. అయితే వ్యాపారులంతా కలిసి రూ.600 నుంచి వెయ్యి వరకు ధర తగ్గించి టెండర్లు వేయడంతో రైతులు వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క రోజే ఇంత ధర తగ్గిస్తారా అని నిలదీశారు. మార్కెట్ అధికారులు ఈ విషయంలో ఎలాంటి జోక్యం చేసుకోకపోవడంతో రైతులు మార్కెట్‌లో విక్రయాలను బంద్ చేసి అచ్చంపేటలోని అంబేద్కర్‌కు చౌరస్తాలో బైఠాయించారు. ఈ సందర్భంగా రోడ్డుపై వేరుశనగకు నిప్పుపెట్టి నిరసన వ్యక్తం చేశారు. తాము ఆరుగాలం కష్టించి పండించిన పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. తమకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలని, లేదంటే ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ గంటపాటు రోడ్డుపైనే బైఠాయించారు. ఈ సందర్భంగా ఉప్పునుంతల మండలం పూర్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని కృష్ణవరం గ్రామానికి చెందిన జైహింద్‌రెడ్డి మాట్లాడుతూ తాను సొంత పెట్టుబడి పెట్టుకొని వేరుశనగ పంటను సాగు చేసి మార్కెట్‌కు తీసుకువచ్చానని, మార్కెట్ అధికారులు, కమీషన్ ఏజెంట్లు, ట్రేడర్స్ కుమ్మక్కై తన పంటకు రేటు నిర్ణయించలేదని ఆరోపించారు. పల్కపల్లి గ్రామానికి చెందిన నర్సింహ అనే రైతు మాట్లాడుతూ వేరుశనగ పంటను కొనుగోలు చేసే ట్రేడర్స్ నియమనిబంధనలు పాటించడం లేదని తమ ఇష్టాను సారంగా రేట్లు నిర్ణయించి రైతుల కడుపు కొడుతున్నారని వాపోయారు. మార్కెట్‌కు తీసుకువచ్చిన వేరుశనగ రాశిలో నుంచి శాంపిల్స్ సేకరించి అవుటాన్ తీయాల్సి ఉండగా ట్రేడర్లు అలా చేయకుండా స్వలాభం కోసం గుమాస్తాలను పంపించి నామమాత్రంగా వేరుశనగ రాశిని పరిశీలించి కేవలం రూ.4,500 నుంచి 5,500 లోపు రేట్లు వేసి రైతుల కడుపుకొడుతున్నారని ఆరోపించారు. రైతుల ఆందోళనకు సీపీఎం మండల కార్యదర్శులు మల్లేశ్, శంకర్‌నాయక్ మద్దతు తెలిపారు. మోసం చేస్తున్న దళారులను మార్కెట్ నుంచి బయటికి వెళ్లగొట్టి, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న సీఐ రవీందర్, ఎస్సై రాములు వెంటనే అక్కడికి చేరుకొని మార్కెట్ చైర్పర్సన్ అరుణ, కార్యదర్శి నర్సింహులను పిలిపించి రైతులతో మాట్లాడించారు. అయితే వారు మార్కెట్‌కు వెళ్లి మాట్లాడుదామని చెప్పడంతో రైతులు శాంతించి అక్కడకు వెళ్లారు. అనంతరం వారు చర్చించి రైతులకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మార్కెట్ చైర్పర్సన్ అరుణ మాట్లాడుతూ రైతుల పక్షాన నిలబడుతామని, న్యాయం జరిగే వరకు వారితోనే ఉంటానని ప్రకటించారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన వంద మంది రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు చేయకపోవడంతో మార్కెట్లోనే ఉన్న వేరుశనగ

రాత్రంతా పడిగాపులు

అచ్చంపేట, ఫిబ్రవరి 7 : అచ్చంపేటలో మ ద్దతు ధర కోసం ఆందోళన చేస్తున్న వేరుశనగ రైతులతో అధికారులు, పోలీసులు మాట్లాడడంతో శాంతించారు. అనంతరం వారిని మార్కెట్ యార్డుకు తీసుకెళ్లారు. క్వింటా కు రూ.6 వేలు ఉన్న పల్లీకి అదనంగా రూ.150 ధర కల్పిస్తామని, అలాగే రూ.7 వేలపైబడిన ధరకు రూ.50 అదనంగా చెల్లిస్తామని వ్యాపారులు ప్ర కటించారు. రాత్రి కావడంతో కొనుగోళ్లను గురువారం ఉదయం నిర్వహించాలని నిర్ణయించారు. అయితే రైతు లు మాత్రం మార్కెట్‌లోనే వేరుశనగ వద్ద పడిగాపులు కాశారు. భోజనం చేయడానికి, బస చేయడానికి ఇక్కట్లు పడడం కనిపించింది. రాత్రంతా జాగారం చేశారు.

మార్కెట్‌కు 5,015.75 క్వింటాళ్ల రాక

అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం 5,015.75 క్వింటాళ్ల (20,063 బస్తాలు) వేరుశనగను రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. క్వింటాకు గరిష్ఠంగా రూ.7,266 ధర పలకగా.. కనిష్ఠంగా రూ.5,040 ధర వచ్చింది. మాడల్ ధర రూ.6,510 లభ్యమైంది. 412 కుప్పలు ఏర్పాటు చేశారు.

పల్లీ కుప్పల వద్దే భోజనం చేస్తున్న మహిళా రైతులు

సిండికేట్‌గా దోపిడీ చేస్తున్నారు..

రాత్రింబవళ్లు కష్టపడి పంట పండిస్తే అధికారులు, వ్యాపారస్తులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు కొంటున్నారు. ముందురోజు రూ.8వేలకు పైగా పలికిన ధర ఇవాళ రూ. 6,600కు చేరింది. నాలుగెకరాల్లో వేరుశనగ సాగు చేశా. 75బస్తాలు వస్తే అమ్మడానికి తెచ్చిన. గద్వాల, వనపర్తి, పెబ్బేరు నుంచి వ్యాపారస్తులు పల్లీని చూసి అధిక ధరకు కొనుగోలు చేసేవారు. ఇక్కడ మార్కెట్లో వ్యాపారస్తులు సిండికేట్‌గా మారి వ్యాపారస్తులను రానిస్తలేరు. క్వింటాకు రెండు కిలోల తరుగు, హమాలీ, తూకం పేరుతో కమీషన్లు వసూలు చేసి మా కడుపు కొడుతున్నారు.

– బండారి రాములు, రైతు, అచ్చంపేట

రెండు రోజులుగా మార్కెట్లోనే ఉన్నా..

నేను ఐదెకరాల్లో వేరుశనగ సాగు చేశా. 190 బస్తాల పల్లీని అచ్చంపేట మార్కెట్‌కు రెండు రోజుల కిందట తీసుకొచ్చా. ఒక బొడ్డె పల్లీలకు క్వింటాకు రూ.5వేల ధర నిర్ణయించారు. ఇంకో 75బస్తాలు అలాగే ఉన్నాయి. రెండు రోజుల నుంచి మార్కెట్లోనే పడుకుంటున్నా. ధర్నా చేస్తే వ్యాపారస్తులు రూ.150వరకు పెంచుతామని చెబుతున్నారు. ఉన్నట్టుండి ధరలు మార్చేస్తే పెట్టుబడి కూడా రాదు. అచ్చంపేట మార్కెట్లో రైతులకు బాగా నష్టం చేస్తున్నారు. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అధికారులకు చెప్పినా మాకేం సంబంధం లేదన్నట్లు చేస్తున్నరు.

– వెంకటయ్య, రైతు, తెల్కపల్లి

ప్లేట్లతో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

ఈ భోజనం మాకొద్దు

- క్వాలిటీ, క్వాంటిటీలేని ఫుడ్‌తో చదువలేకపోతున్నాం
- మెనూ సరిగ్గా లేదంటూ విద్యార్థుల ఆగ్రహం
- నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్
- ర్యాలంపాడు స్కూల్ నుంచి కలెక్టరేట్ వరకు కాలినడక
- స్టూడెంట్స్‌ను అడ్డుకున్న పోలీసులు, అధికారులు
- సర్దిచెప్పడంతో వెనుదిరిగిన గురుకులం విద్యార్థులు

విద్యార్థులకు సర్దిచెప్పి తిరిగి పాఠశాలకు తీసుకెళ్తున్న ఎస్సై

ధరూరు, ఫిబ్రవరి 7 : తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత కేసీఆర్ ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. పేదలందరికీ విద్య అందించాలన్న సదుద్దేశంతో ప్రతి మండలంలో గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసింది. ఇందులోని విద్యార్థులకు ఎప్పటికప్పుడు పౌష్టికాహారం అంచింది వారి విద్యాభివృద్ధికి కృషి చేసింది. అటువంటి గురుకులాలు నేడు సమస్యల వలయంలో చిక్కుకొన్నాయి. కొన్ని రోజులుగా నాసిరకమైన భోజనం పెడుతుండడంతో విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన బాటపట్టారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని ధరూర్ మండలం ర్యాలంపాడు రిజర్వాయర్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహిస్తున్న కేటీదొడ్డి మండలానికి చెందిన మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల సంక్షేమ పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు 500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కొద్ది రోజులుగా వీరికి అందించే ఆహారంలో ఏ మాత్రం మెనూ పాటించకుండా నాసిర కమైన భోజనం అందిస్తుండడంతో విద్యార్థులంతా కడుపు మాడ్చుకొని చదవలేమని ఈ భోజనాలు మాకొద్దు బాబోయ్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటితో ఆగకుండా విద్యార్థులందరూ కలిసి మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని, గురుకులాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని నినాదాలు చేస్తూ గద్వాలలోని కలెక్టరేట్ వెళ్లేందుకు కాలినడకన ర్యాలీగా బయలుదేరారు. విషయం తెలుసుకున్న ఎస్సై విజయ్‌కుమార్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని విద్యార్థులకు నచ్చజెప్పి కలెక్టరేట్‌కు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఎస్సై వెంటనే ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లగా జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ శ్వేతా ప్రియదర్శిని, ఎంఈవో సురేశ్ అక్కడికి చేరుకొని బూరెడ్డిపల్లి పాఠశాలలో విద్యార్థులను కూర్చొబెట్టి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొది రోజులుగా మెనూ ప్రకారం భోజనాలు పెట్టడం లేదని, ప్రిన్సిపాల్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఇక నుంచి మేమే చూసుకుంటామని, మెరుగైన భోజన వసతి కల్పిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు తిరిగి గురుకుల పాఠశాలకు చేరుకున్నారు.

కడుపునిండా భోజనం పెట్టడం లేదు

మాకు ఎప్పుడూ కడుపునిండా భోజనం పెట్టడం లేదు. మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలని అడుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ రోజు మధ్యాహ్నం చికెన్ పెట్టాలి, అయినా పెట్టలేదు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకుపోగా ఆయన సర్దిచెప్పడం తప్ప ఒక్క రోజు కూడా మా వైపు నుంచి ఆలోచించలేదు. ఈ విషయం మేము మూడు నెలల ముందే కలెక్టర్‌కు చెప్పాలనుకున్నాం. అప్పుడు ఎగ్జామ్స్ ఉన్నందున సాధ్యం కాలేదు. ఇప్పుడు మరికొన్ని రోజుల్లో పరీక్షలు ఉన్నాయి. ఇక కడుపులు మాడ్చుకొని చదువడం కష్టంగా మారింది. దీంతో ఈ విషయం చెప్పడానికే మేం కలెక్టర్ వద్దకు బయలుదేరాం.

– సిద్ధార్థ, ఇంటర్ విద్యార్థి

మెనూ అమలు చేయడం లేదు..

మాకు మెనూ ప్రకారం టిఫిన్, భోజనాలు పెట్టాలి. కొద్ది రోజుల నుంచి ఏ మాత్రం అమలు చేయడం లేదు. ఉదయం టిఫిన్‌కు పెట్టే ఇడ్లీలు రాళ్లలా ఉంటున్నాయి. పాఠశాలలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు కేవలం మూడు సార్లు మాత్రమే మటన్ వండిపెట్టారు. చికెన్ కూడా సక్రమంగా పెట్టడం లేదు. వారికి బుద్ధిపుట్టినప్పుడే పెడుతున్నారు లేదంటే లేదు. అన్నం కూడా సరిగా ఉండడం లేదు. మాకు కడుపునిండా భోజనం పెట్టాలని పలుమార్లు ప్రిన్సిపాల్‌ను వేడుకున్నా పట్టించుకోలేదు. దీంతోనే మా సమస్యలు కలెక్టర్‌తోనైనా చెప్పుకుందామని గద్వాలకు బయలుదేరాం.

–శివ, 9వ తరగతి విద్యార్థి, ఫుడ్ స్టోర్ లీడర్

బిల్లులు ఇవ్వకపోతే మేమేం చేయాలి

ప్రస్తుతం మార్కెట్ రేట్లు, ప్రభుత్వం ఇచ్చే రేట్లకు ఏ మాత్రం సరిపోవడం లేదు. మేము మాత్రం ఏం చేయాలి. సాధ్యమైనంత వరకు ప్రయత్నం చేస్తున్నాం. విద్యార్థులు కూడా నా దృష్టికి తీసుకువచ్చారు. నా వంతుగా నాణ్యమైన భోజనం ఇవ్వడానికే ప్రయత్నం చేస్తున్నాను. సరైన సమయంలో బిల్లులు రాక టెండర్ దారులకు బిల్లులు చెల్లించలేక పోతున్నాం. అందువ ల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– రాంబాబు, కేటీదొడ్డి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం..

విద్యార్థులు ఎప్పుడూ భోజనాలకు సంబంధించి సమస్య గురించి చెప్పలేదు. అయినా ప్రిన్సిపాల్ నిబంధనల ప్రకారం విద్యార్థులకు భోజనం అందించలేకపోతే లెటర్ రాసి తొలగిపోవాలి. ఈ విధంగా విద్యార్థులను ఇబ్బంది పెట్టడం తప్పు. విద్యార్థులు నాతో మాట్లాడిన ప్రకారం పండ్లు, మటన్, చికెన్ ఇవ్వాల్సి ఉన్నా ఇవ్వడం లేదని, బిల్లులు మాత్రం అన్నీ ఇచ్చినట్లు రాసుకుంటున్నారు. ప్రస్తుతం విద్యార్థులు రోడ్డుపైకి వచ్చారని కలెక్టర్ దృష్టికి వెళ్లింది, ఆయన ఆదేశాల మేరకు నేను ఇక్కడికి వచ్చాను. ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– శ్వేతాప్రియదర్శిని, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి